క్లుప్తంగా

మేదరిపేటలో 'మన సారె.. మనసారా'



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

దండేపల్లి: మండలంలోని మేదరిపేట శ్రీ లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో 'మన సారె.. మన సారా' మన అమ్మకు కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ఓడి బియ్యం పోసే కార్యక్రమాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. శ్రీశైవ క్షేత్ర వనిత శక్తి మేదరిపేట సభ్యులు పాల్గొన్నారు.

పీఎస్సార్ మంత్రి కావాలని పూజలు



పూజలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలుపొందిన కొక్కిరాల ప్రేంసాగర్‌రావు కొత్తగా ఏర్పడే ప్రభుత్వంలో మంత్రి కావాలని కోరుతూ పట్టణ కాంగ్రెస్ నాయకులు బుధవారం అయ్యప్ప దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా 11కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మల్లయ్య, నాయకులు పాల్గొన్నారు.

'వినోద్‌ను గెలిపించిన ఓటర్లకు కృతజ్ఞతలు'



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నెన్నెల: కాంగ్రెస్ పార్టీ నుంచి బెల్లంపల్లి ఎమ్మెల్యేగా గడ్డం వినోద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించిన ఓటర్లకు అవిశ్రాంతంగా పని చేసిన తోటి కాంగ్రెస్ కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని డీసీసీ సభ్యుడు గట్టు బానేష్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలను ఎమ్మెల్యే వినోద్ నెరవేర్చి గ్రామాలను ప్రగతిపథంలో నడిపించి ఆదర్శ నియోజకవర్గంగా బెల్లంపల్లిని తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో మైనార్టీ అధ్యక్షులు మొహిద్‌ఖాన్, కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు శ్రీనివాస్, సీనియర్ నాయకులు శంకరయ్య, గట్టు శివలింగయ్య, గంగిరెడ్డితిరుపతిరెడ్డి, తమ్మినవేణి రాజేష్, గోమాస లింగయ్య, దుర్గం చంద్రయ్యలు పాల్గొన్నారు.

'ధాన్యం తూకంలో తరుగు దోపిడీ ఉండదు'

దండేపల్లి: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించే రైతులకు ఇక నుంచి తరుగుదోపిడీ కష్టాలు ఉండవని, ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు కాంగ్రెస్ పార్టీ శ్రేణుల ద్వారా రైతులకు తెలియజేశారు. రాజీవ్‌గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి, ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్ష కార్యదర్శులు అక్కల వెంకటేశ్వర్లు, కంది సతీష్ బుధవారం దండేపల్లిలో విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదనే ఉద్దేశంతో, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయిస్తే, సంచి బరువుకు సంచి తప్పా తరుగుపేరిట అదనంగా కిలో, రెండు కిలోలు తూకం వేయడం ఉండదన్నారు. ఈ మేరకు ఈ విషయాన్ని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ఫోన్లో జిల్లా అధికారులతో మాట్లాడినట్లు పేర్కొన్నారు. ఎన్నికల్లో ప్రేంసాగర్‌రావును భారీ మెజార్టీతో గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

'హామీలు నెరవేరుస్తుంది'

బెల్లంపల్లి: రాష్ట్రంలో పదేళ్లుగా సాగిన దొరపాలన పీడ విరగడై ప్రజాపాలన ఏర్పడబోతుందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, బెల్లంపల్లి మున్సిపల్ మాజీ చైర్మన్ మత్తమారి సూరిబాబు అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అరాచక పాలన సాగించిందని, ప్రజల సమస్యలను గాలికొదిలి కేసీఆర్ తన సౌఖ్యమే చూసుకున్నారని తెలిపారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి విజయాన్ని కట్టబెట్టారని తెలిపారు. కాంగ్రెస్‌ను గెలిపించిన ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి పదవిని చేపడతారని, ఆయన సీఎం కాగానే ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయనున్నట్లు తెలిపారు. ఆరు గ్యారెంటీలను అమలు చేసి జనరంజక పాలన అందించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కసరత్తు చేస్తోందని తెలిపారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి



కొటాల: ముత్తంపేటలో నివాళులర్పిస్తున్న నాయకులు



దహెగాం: నివాళులర్పిస్తున్న నాయకులు



కాగజ్‌నగర్‌రూరల్: నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

దహెగాం: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంతో పాటు ఇట్యాల, కోఠ్మీర్, బీబ్రా, ఐనం, పీపీరావు కాలనీ తదితర గ్రామాల్లో వర్ధంతి నిర్వహించారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పాత్రికేయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కెరమెరి: అంబేడ్కర్ ఆశయాల సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జాఫర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో అంబేడ్కర్ 67వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మొహర్లే తిరుపతి, సెండే లక్ష్మణ్ ఉన్నారు.

కౌటాల: అంబేడ్కర్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని మహార్ సంఘం మండల నాయకులు పి. బండురావు అన్నారు. బుధవారం మండలంలోని ముత్తంపేట్ గ్రామంలో మహార్ సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ 67వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పల్లెల్లో వేడుకలు..

అంబేడ్కర్ వర్ధంతి పురస్కరించుకొని మండల కేంద్రంలోని భారతి విద్యామందిర్ పాఠశాలలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండలంలోని వీరవెల్లి, ముత్తంపేట్, వీర్దండి, యాపలగూడ, గుండాయిపేట, తాటినగర్, బోదంపల్లి, సదాశివపేట, బాలేపల్లి, తాటిపల్లి, గుడ్లబోరి, తలోడి, కనికి గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు మహార్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహార్ సంఘం నాయకులు పాపయ్య, రావుజీ, విశ్వనాథ్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి): మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో బుధవారం రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. జోర్‌పల్లి గ్రామంలో ఎంపీపీ చునార్కర్ సువర్ణ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వాంకిడి: మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్, ఖమాన గ్రామంలోని నాగసేన్ బుద్ధ విహార్‌లో అంబేడ్కర్ సంఘం నాయకులు అంబేడ్కర్ వర్ధంతి పురస్కరించుకొని ఘన నివాళులర్పించారు. పంచశీల జెండా భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్, మండల అధ్యక్షుడు జైరాం ఉప్రే, నాయకులు మిలింద్ జాడె, టీమాజీ, పెంటూజీ, రోషన్, అరుణ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



సిర్పూర్ (టి): నివాళులర్పిస్తున్న ఎంపీపీ



కెరమెరి: నివాళులర్పిస్తున్న జాఫర్

బెజ్జూర్: మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి సర్పంచ్ అన్సార్ హుస్సేన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఎస్పీ పార్టీ నాయకులు చిప్పకుర్తి దేవాజీ, కుమ్మరి పోశం, రంజిత్, జీవన్, పెంటన్న, వాసుదేవ్, రంగన్న, దాసురయ్య, మార్కుల సంఘం యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే అత్రం సక్కు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ 67వ వర్ధంతిని ఎంపీపీ మల్లికార్జున్‌తో కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేశారు. ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత, బహుజన వికాసానికి పాటు పడిన మహానేత అంబేడ్కర్ అన్నారు. జిల్లా కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం భవనంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రూపునర్ రమేశ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మారుతి అధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. సందీప్ నగర్‌లో మహార్ సంఘం అధ్వర్యంలో, జై భీం సేవ సంఘం అధ్యక్షుడు వినోద్, ప్రమోద్‌ల ఆధ్వర్యంలో వర్ధంతి నిర్వహించారు. ఎంపీవో ప్రసాద్, నాయకులు సుధాకర్, వినేష్ తదితరులు పాల్గొన్నారు.

చింతలమానెపల్లి: మండలంలో బుధవారం బాబాసాహెబ్ అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని డబ్బా, రుద్రాపూర్, దిందా, రణవెల్లి తదితర గ్రామాలలో వర్ధంతి నిర్వహించారు.

కాగజ్‌నగర్‌రూరల్: దళితులు, మహిళలు, కార్మికుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు అంబేడ్కర్ అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా బుధవారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పట్టణ అధ్యక్షుడు సిందం శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు విశ్వేశ్వర్‌రావు, నాయకులు అశోక్, వెంకటేశం, శ్రీనివాస్, రమేశ్, అశోక్‌లోయా, రమేశ్, రాజు, కార్తీక్, వెంకటేశ్, శివ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ కార్యాలయంలో..

పట్టణంలోని విద్యుత్ డివిజన్ కార్యాలయంలో బుధవారం అంబేడ్కర్ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆనంద్‌కుమార్, చంద్రశేఖర్, పట్టణ ఏఈ కమలాకర్, రూరల్ ఏఈ జగన్మోహన్, కమర్షియల్ ఏఈ సంతోశ్, జేఏవో తుకారాం, నాయకులు వెంకటేశ్, ఎమ్మాజీ సతీశ్, విద్యుత్‌శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో...

అంబేడ్కర్ చౌరస్తాలో గల విగ్రహానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోనేరు కోనప్ప పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెబ్బెన: అంబేడ్కర్ 67వ వర్ధంతిని బుధవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. గోలేటి టౌన్‌షిప్‌లోని టీబీజీకేఎస్ కార్యాలయంలో వర్ధంతి నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంఘం కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్, కేంద్రకమిటీ చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రకాశ్‌రావు, జీఎం కమిటీ సభ్యులు రవీందర్, సమ్మయ్య, నాయకులు ఉన్నారు.



వాంకిడి: నివాళులర్పిస్తున్న నాయకులు



బెజ్జూర్‌లో..



ఆసిఫాబాద్‌రూరల్: నివాళులర్పిస్తున్న సక్కు



రెబ్బెన: టీబీజీకేఎస్ కార్యాలయంలో..

11న మండల సర్వసభ్య సమావేశం

ఆసిఫాబాద్‌అర్బన్: ఈనెల 11న ఉదయం 11 గంటలకు జిల్లా కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శకుంతల ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ మ ల్లికార్జున్ అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్న ట్లు పేర్కొన్నారు. సమావేశానికి మండల ప్రజాపరిషత్ సభ్యులు, అధికారులు సకాలంలో అభివృద్ధి నివేదికలతో హాజరు కావాలని సూచించారు.

సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై మధుకర్

కౌటాల: బాధితుడు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై మధుకర్ బుధవారం అప్పగించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని గురుడుపేట గ్రామానికి చెందిన మెర్వల్లి సుధాకర్ సెల్‌ఫోన్ పోగొట్టుకొని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా పోగొట్టుకున్న మొబైల్‌ను గుర్తించి బాధితుడికి అందజేశామని ఎస్సై తెలిపారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న సీడీపీవో ఇందిర

జైనూర్: మండలంలోని రాసిమెట్ట గ్రామంలో అంగన్‌వాడీ ఆయాగా విధులు నిర్వహిస్తున్న గిరిజాబాయి(69) బుధవారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఐసీడీఎస్ సీడీపీవో ఇందిర అంగన్‌వాడీ కార్యకర్తలతో బాధిత కుటుంబాన్ని పరామర్శించి అంత్యక్రియల నిమిత్తం అంగన్‌వాడీ మండల యూనియన్ ఆధ్వర్యంలో రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు. మృతురాలికి ఒక కుమారుడు ఉన్నాడు. సూపర్‌వైజర్ పెంటుబాయి, అంగన్‌వాడీలు డోంగ్రే గోదావరి, రాజమణి ఉన్నారు.

నగదు ఎత్తుకెళ్లిన దొంగలు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నం.13 గ్రామానికి చెందిన భరుణ్ కుమార్ ఇంట్లో మంగళవారం రాత్రి దొంగతనం జరిగినట్లు ఈజ్‌గాం ఎస్సై రామన్‌కుమార్ తెలిపారు. భరుణ్‌కుమార్ ఇంటి ఆవరణలోని పూజా మందిరంలో గల హుండీని పగులగొట్టి గుర్తుతెలియని వ్యక్తులు సుమారు రూ.45 వేలు దొంగిలించినట్లు పేర్కొన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామన్నారు.

ధాన్యం కొనేది లేనట్టేనా..?

- వరి కోతలు ప్రారంభమై నెలరోజులు
- ఇంకా ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు
- వానలతో రైతుల్లో ఆందోళన
- ప్రైవేటుకు విక్రయిస్తున్న వైనం



దహెగాంలో ధాన్యం కుప్పలు

దహెగాం: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వరి పంట కోతలు ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా కొనుగోలు కేంద్రాలు మాత్రం ఇంకా ప్రారంభించలేదు. ఇప్పటికే సుమారు 75 శాతం కోతలు పూర్తికాగా చేతికొచ్చిన ధాన్యాన్ని కల్లాల్లో ఆరబెట్టి కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు ఎదురుచూస్తున్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో జాప్యం జరుగుతుండడంతో రైతులు చేసేదేమి లేక ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. కొనుగోలు కేంద్రాలు నవంబరు మొదటి వారంలో ఏర్పాటు చేయాల్సి ఉండగా నేటికీ ప్రారంభించక పోవడంతో ఈసారి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు లేనట్టేనా..? అన్న అనుమానాలు రైతుల్లో కలుగుతున్నాయి. మరోవైపు తుపాను ప్రభావంతో వానలు పడుతుండడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

కేంద్రాల ఏర్పాటు ఉత్తిమాటేనా..?

జిల్లాలో అధికంగా సిర్పూర్ (టి) నియోజకవర్గంలో వరి సాగు చేశారు. దహెగాం, పెంచికల్‌పేట్, బెజ్జూర్, కౌటాల, చింతలమానెపల్లి, కాగజ్‌నగర్, సిర్పూర్(టి) మండలాల్లో వేల ఎకరాల్లో సాగవుతుంది. కాగా ఈ ఖరీఫ్ సీజన్ వరి కోతల సమయంలో అసెంబ్లీ ఎన్నికలు రావడంతో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై అధికారులు దృష్టి సారించలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వరి ధాన్యాన్ని ప్రైవేటు వ్యాపారులకు క్వింటాలుకు రూ.1900 నుంచి రూ.2,000 లకు విక్రయిస్తూ ఆర్థికంగా నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు.

పొంచి ఉన్న తుపాను ముప్పు..

జిల్లాకు పక్కనే ఉన్న మంచిర్యాల జిల్లాలో అక్కడి అధికారులు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల వద్ద నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఆసిఫాబాద్ జిల్లాలో మాత్రం ఎందుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలేదని రైతులు మండి పడుతున్నారు. ధాన్యాన్ని కల్లాల్లో ఆరబెట్టగా మిచాంగ్ తుపాను ప్రభావంతో గత నాలుగు రోజులుగా జల్లులు కురుస్తున్నాయి. దీంతో రైతులు ధాన్యాన్ని తడవకుండా కాపాడేందుకు నానా తంటాలు పడుతున్నారు. అద్దెకు టార్పాలిన్లు తీసుకొచ్చి ధాన్యం కుప్పలపై కప్పుతున్నారు. ఒక్కో టార్పాలిన్‌ను రోజుకు రూ.30 నుంచి రూ.40 చెల్లించి ఆర్థికంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండ వస్తే ఆరబెట్టడం, మబ్బులు వస్తే కుప్ప చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

ప్రైవేట్ వాళ్లకు అమ్మిన..



ఈ సంవత్సరం వానాకాలంలో వరి సాగు చేసిన. నెల రోజుల క్రితమే వరి కోతలు పూర్తయ్యాయి. పది రోజుల పాటు ఆరబెట్టి ప్రైవేటు వ్యాపారికి క్వింటాలుకు రూ.2వేలకు అమ్మిన. సర్కారు వాళ్లు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రైవేటుకు అమ్ముకోవాల్సి వచ్చింది.

\- చాపిలె శంకర్, రైతు, దహెగాం

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



నవంబరులో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉన్నా ఇప్పటికీ ఏర్పాటు చేయకపోవడంతో చాలా మంది రైతులు ప్రైవేటు వాళ్లకు అమ్ముకొని నష్టపోతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతుధర కంటే తక్కువకు అమ్ముకుంటున్నారు. అధికారులు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

\- గంగన్న, రైతు,లగ్గాం

యూడైస్‌పై ఉపాధ్యాయులకు అవగాహన



కెరమెరి: మాట్లాడుతున్న ఎంఈవో సుధాకర్

తిర్యాణి: మండల కేంద్రంలోని విద్యావనరుల కార్యాలయంలో యూడైస్‌పై యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఎంఈవో వెంకటేశ్వర స్వామి బుధవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యూడైస్ ఫార్మాట్‌లో పిల్లలు, ఉపాధ్యాయులు, పాఠశాలలకు సంబంధించిన పూర్తి వివరాలను నమోదు చేయాలన్నారు. ఎలాంటి తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కెరమెరి: ఎలాంటి తప్పులు దొర్లకుండా యూడైస్ పూరించాలని ఎంఈవో విద్యాధికారి కుడ్మెత సుధాకర్, ఎంఎస్‌వో ఆడే ప్రకాశ్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులకు యూడైస్‌పై నిర్వహించిన ఒక రోజు శిక్షణలో మాట్లాడారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, ప్రతీరోజు ఎఫ్ఆర్ఎస్‌లో విద్యార్థుల హాజరు వేయాలన్నారు. కెరమెరి కాంప్లెక్స్ హెచ్ఎం చంద్రశేఖర్, పాఠశాలల హెచ్ఎంలు, ఎంఆర్సీ, సీఆర్సీ సిబ్బంది పాల్గొన్నారు.

చినుకు పడితే చిత్తడే.!



దహెగాం: మండల కేంద్రంలోని మార్కెట్ ఏరియాలో గల రోడ్లు చిన్న వానకే చిత్తడిగా మారుతున్నాయి. బుధవారం మధ్యాహ్నం నుంచి కురుస్తున్న ముసురుకు రోడ్లు అధ్వానంగా మారడంతో ప్రజలు నడిచేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షపు నీరు రోడ్లపై నుంచి పారుతుంది. పంచాయతీ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన

వాంకిడి: మండలంలోని ఇందాని ఉప ఆరోగ్య కేంద్రంలో వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పించారు. పిల్లలు, పుట్టబోయే శిశువు ఆరోగ్యంగా ఉండేందుకు ప్రభుత్వం నుంచి ఉచితంగా పంపిణీ చేసే టీకాలను క్రమం తప్పకుండా తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి పెందూర్ రవిదాస్, ఎమ్ఎల్‌హెచ్‌పీ సుచరిత, ఏఎన్ఎం కాంత, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కొనుగోలు కేంద్రం ప్రారంభం

చెన్నూర్‌రూరల్: మండలంలోని సుబ్బరాంపల్లిలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఏవో అవగాహన కల్పించారు.